# ఆత్మబంధువు

తలుపు దబదబమని కొడుతున్న చప్పుడు, నిద్రపోతున్న చంద్రశేఖరం బద్ధకంగా లేచి తలుపు తీశాడు. ఎదురుగా రామానుజం ఇంజనీరింగ్ కాలేజీ మిత్రుడు. “చాన్నాళ్ళ తర్వాత!” అంటూ స్నేహితుడివైపు చూసి చెయ్యి పట్టుకొని అలాగే ఉండిపోయాడు.

“ప్రొద్దున్నే వచ్చి నిద్ర చెడగొట్టినట్టున్నాను. ట్రైనింగ్ ప్రోగ్రామ్ వుంది. పది గంటలకు ఉండాలి. హోటల్‌లో సామాను పడేసి సరాసరి వచ్చేసాను నిన్ను చూద్దామని” అన్నాడు రామనుజం.

“సంతోషం. అయితే మా ఆవిడ, అబ్బాయి ఊరెళ్ళారు. ఒక్క క్షణం కూర్చో, కార్యక్రమాలు పూర్తిచేసుకుని వస్తాను” అంటూ ఆ రోజే వచ్చిన న్యూస్ పేపర్ ఇచ్చి లోపలకు వెళ్ళాడు చంద్రశేఖరం.

రామానుజం తన కూర్చున్న హాల్ వంక పరీక్షగా చూసాడు. మార్బుల్ వేసిన ఫ్లోరింగ్ ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఇంటరీయర్ డిజైనింగ్. ‘వీళ్ళ అభిరుచి బాగుంది’ అనుకుంటూ వాల్‌పుట్టీ వేసిన గోడ మీద చెయ్యి వేసి తడుముతూ అల్మారాలో వున్న ఫోటో ఫ్రేమ్‌ల కేసి ఆశ్చర్యంగా చూశాడు. పెద్ద సైజులో లామినేట్ చేయబడిన ఫోటోలు నాలుగు. అన్నిటిలోనూ ఒకే కుక్కపిల్ల ఫోటో. ఆ ఫోటోల వంకే చూస్తూ పేపర్ చదవడం పూర్తిచేశాడు. పావుగంట తర్వాత కాఫీ కప్పులతో వచ్చాడు చంద్రశేఖరం.

కాఫీ కప్పు అందు కొంటూ “ఆ కుక్కపిల్లల ఫోటోలేమిటి? కుక్కల్ని పెంచడం నీ హాబీనా?” అన్నాడు రామానుజం. “కుక్కపిల్ల కాదు బుజ్జితల్లి. అవన్నీ బుజ్జి తల్లి ఫోటోలు” అంటూ ఆ ఫోటోలకేసి చూసి నిట్టూర్చాడు చంద్రశేఖరం.

“ఏంటీ బుజ్జితల్లి అంటే కుక్క పేరా? ఏదీ కనబడదేం?” అంటూ లోపలకు చూశాడు రామానుజం.

“రా బయట వుంది.” అంటూ చంద్రశేఖరం బైటకు నడిచాడు. ఆ ఇంటిముందు బాగా ఎత్తుగా పెరిగిన పూలమొక్కల మధ్యన తులసికోట.

“ఇదిగో బుజ్జితల్లి ఇక్కడే వుంది” అంటూ తులసికోట మీద చెయ్యి వేసి చెప్పాడు చంద్రశేఖరం.

“మైగాడ్, కుక్కకు ఇంట్లోనే సమాధి కట్టారా, వెరీ ఇంటరెస్టింగ్, శ్రీశ్రీగారు కుక్కపిల్ల, అగ్గిపుల్ల సబ్బుబిళ్ళ హీనంగా చూడకు దేన్నీ అన్నారు. ఆ మాట నిజం చేసావన్నమాట” అన్నాడు రామానుజం నవ్వుతూ. అతడి మాటలకు చంద్రశేఖరం నవ్వలేదు. ముభావంగా ఇంట్లోకి నడిచాడు.

మిత్రుడి ముఖంలోని భావాలు గమనిస్తూ “కుక్క ఫోటోలు ఇంట్లో పెట్టు కోవడంతో పాటూ, దానికి సమాధి కూడా కట్టించావంటే ఏదో బల మయిన విషయం ఉంటుంది. ఏమిటీ కథ” అన్నాడు. చంద్రశేఖరం ఒక్కసారి కళ్ళు మూసుకుని తలవెనక్కి వాల్చి చెప్పటం ప్రారంభించాడు.

* * *

చిన్నతల్లి ఆ ఇంటికి వచ్చినపుడు ఆమె వయసు పదేళ్లు. చిన్నతల్లికి ఒక అన్నయ్య, చెల్లి ఉన్నారు. చిన్నతల్లి నాన్న రిక్షా లాగుతూ వచ్చిన డబ్బుల్తో తాగేస్తాడు. ఆమె తల్లి ఇళ్ళల్లో పనిచేస్తుంది. వాళ్ళది శ్రీకాకుళం దగ్గర ఒక పల్లెటూరు. సంసారం గడవటం కష్టమవటంతో మగపిల్లాడిని ఒక కారు షెడ్డులో కుదిర్చింది. చిన్నతల్లిని ఏదైనా ఇంట్లో పనిలో పెడదామని ప్రయత్నాలు ప్రారంభించింది.

శ్రీకాకుళంలో చంద్రశేఖరంగారి ఇంట్లో పనికి పిల్ల కావాలని తెలియటంతో చిన్నతల్లిని వాళ్ళమ్మ తీసుకొచ్చింది. చంద్రశేఖరం గారి భార్య

చిన్నతల్లిని పరిశీలనగా చూసి "ఇంటి పనితోపాటూ బాబునూ ఎత్తుకుని ఆడించాలి, ఆ పనంతా చెయ్యగలదా?" అంది. "చేస్తుందమ్మా... ఇది చిన్నదైనా మా ఇంట్లో పనంతా ఇదే చేస్తుంది" అంది వాళ్ళమ్మ.

చిరిగిపోయిన గౌను, చింపిరి జుట్టతో వున్నా ముఖం కళగా వుంది. ఉతికిన బట్టలేస్తే శుభ్రంగా వుంటుంది అనుకుంది చంద్రశేఖరంగారి భార్య జయమ్మ. చిన్నతల్లి మరోసారి నఖశిఖ పర్యంతం పరీక్షించి.

అలా ఆ ఇంట్లో చిన్నతల్లి పనికి కుదిరింది. చిన్నతల్లి మొదట్లో భయపడింది ఆ ఇంటి పనంతా చెయ్యడానికి. అయితే జయమ్మగారి కొడుకును చూసేసరికి ఆమెకు అఆ ఇల్లు వదలబుద్ధి కాలేదు. ఆ అబ్బాయి వయసు పది నెలలు. తెల్లగా బొద్దుగా వుండేవాడు. వాడిని ఎత్తుకొని ఆడించడం ఆమెకు సరదా. మొదట్లో వాడు చిన్నతల్లి దగ్గరకు వచ్చేవాడు కాదు. తన కళలన్నీ ప్రయోగించి వాడిని మచ్చిక చేసుకుంది.

అమ్మగారు, అయ్యగారూ ఇద్దరూ ఉద్యోగాలకు వెళ్ళిపోతే చిన్నతల్లి, ఆ అబ్బాయి మాత్రం ఇంట్లో వుండేవారు. ఇంట్లో పనంతా చేసుకునే వారకూ వాడు నిద్రపోయేవాడు. నిద్రలేవగానే పాలసీసా వాడినోట్లో పెట్టి వాడిని ఆడిస్తూ కూర్చునేది చిన్నతల్లి. ఆ టైముకు చంద్రశేఖరంగారూ, జయమ్మ వచ్చేవారు. పిల్లాడిని ఎత్తుకొని ఆడించడంతో కలిగే ఆనందంతో చిన్నతల్లికి ఇంట్లో పని కష్టంగా అనిపించేది కాదు.

ఒక రోజు సాయంత్రం అమ్మగారు, అయ్యగారు ఇంకా రాలేదు. పిల్లాడు గుక్క పెట్టి ఏడుస్తున్నాడు. ఎంత ఆడించినా ఏడుపు మానలేదు. ఇంటికి తాళం వేసి పిల్లాడిని తీసుకుని బైటకొచ్చింది చిన్నతల్లి. ఆ ఇంటికి కొంచెం దూరంలో వున్న పార్కులో అబ్బాయిని ఆడిద్దామని తీసుకొచ్చింది. పార్క్‌లోని లాన్ మీద అబ్బాయిని కూర్చోబెట్టి పిల్లి మొగ్గలు వేసింది. చప్పట్లు కొట్టింది. పార్కులోని కొయ్యగుర్రం మీద ఎక్కించింది. అయినా వాడు ఏడుపు మానలేదు.

ఇంతలో సిమ్మెంటు బెంచీ క్రింద 'కుయ్యో' మంటూ చిన్న మూలుగు వినిపించింది. ఆ అబ్బాయి ఆ శబ్దం వస్తున్న వైపు చూశాడు. ఆ శీతాకాలపు చలికి వణుకుతున్న చిన్న కుక్కపిల్ల. అప్పటికి పుట్టి ఏ పది రోజులో అయి వుంటుందేమో దాని తల్లి నించి తప్పిపోయి ఏడుస్తోంది. చిన్నతల్లి ఆ కుక్క పిల్లను బెంచీ క్రిందనుంచి లాగి చేతుల్లోకి తీసుకుంది. పిల్లాడు దాన్ని చూసి ఏడుపు ఆపాడు. కాసేపు ఆ కుక్కపిల్లతో ఆడించి ఇంటికి బయలు దేరింది చిన్నతల్లి. అబ్బాయి మళ్ళీ ఏడుపు మొదలుపెట్టాడు. ఆ కుక్కపిల్ల కావాలంటూ చెయ్యి దానివైపే చూపించాడు. చిన్నతల్లి కుక్కపిల్లను ఇంటికి తీసుకొచ్చింది. అరగంట తర్వాత అమ్మగారు, అయ్యగారు వచ్చారు. ఇంట్లో పిల్లాడితోపాటూ తిరుగుతున్న కుక్కపిల్లను చూసేసరికి జయమ్మకు కోపం వచ్చింది. "పెంటల మీద తిరిగే ఈ కుక్కపిల్లనెందుకు తీసుకొచ్చావ్, దాని ఒంటి నిండా బురద, ఎక్కడనించి తీసుకొచ్చావో అక్కడే వదిలేసిరా" అంది జయమ్మ.

"బాబు ఏడుస్తాడు. నిద్రపోయిన తర్వాత వదిలేసి వస్తాలెండి" అంధి చిన్నతల్లి. బాబు నిద్రపోయిన తర్వాత పార్కులో ఆ కుక్కపిల్లను వదిలేసి వచ్చింది చిన్నతల్లి.

ఉదయం పూట ఇంటి ముందు కళ్ళాపి జల్లి ముగ్గువేస్తున్న చిన్న తల్లికి తన కాలి మీద ఎవరో తడిమినట్టనిపించి వెనక్కి తిరిగింది. తను వదిలేసి వచ్చిన కుక్కపిల్ల. "ఎందుకొచ్చావే మళ్ళీ, అమ్మగారు చూస్తే తిడతారు" అంది. దాని వాళ్ళంతా ప్రేమగా నిమురుతూ చిన్నతల్లి. అటువైపు వెళ్తున్న పక్కింటివారి పనిమనిషి "దాని అమ్మను మునిసిపాలిటీ వేనులో తీసుకెళ్ళి పోయారు. దానితో పాటు పుట్టిన పిల్లలన్నీ తలో దిక్కూ అయి పోయాయి. ఇది పాపం ఒంటరిదైయిపోయింది" అంది.

చిన్నతల్లికి ఆ కుక్కపిల్ల చరిత్ర తెలిసేసరికి జాలి కలిగింది. "అమ్మ

గారిని బతిమాలి నిన్ను వుంచుకుంటానులే" అంటూ ఆ కుక్కపిల్లను తీసుకుని ఇంట్లోకి నడిచింది చిన్నతల్లి. బాబు ఏడుస్తుంటే అమ్మగారు ఎత్తుకొని ఆడిస్తున్నారు. "ఛీ.. దాన్ని మళ్ళీ ఎందుకు తీసుకొచ్చావ్...?" అంది అమ్మగారు కోప్పడుతూ.

ఏడుస్తున్న బాబు, ఆ కుక్కపిల్లను చూసి టక్కున ఏడుపు ఆపాడు. "అమ్మా బాబు సరదా పడుతున్నాడు దీన్ని ఇంట్లోవుంచి పెంచుదాం" అంది. జయమ్మగారు క్షణం సేపు ఆ కుక్కపిల్ల వంక చూసి "ఇద్దరం ఉద్యోగాలకు వెళ్ళిపోయేవాళ్ళం.. ఉన్న ఒక్క పిల్లాడిని పెంచలేక పోతున్నాం. ఈ కుక్కపిల్ల మనకి అదనపు భారం" అంది.

"ఫరవాలేదమ్మా. నేను దీన్ని చూసుకుంటాను" అంది చిన్నతల్లి

"అలాగయితే సరే..." అంది జయమ్మ

"అమ్మా దీనికి ం పేరు పెడదాం? బుజ్జిగా, ముద్దొస్తోంది కదమ్మా... దీన్ని బుజ్జితల్లి అందాం" అంది చిన్నతల్లి.

"అలాగే లేవే!" అంది జయమ్మగారు నవ్వుతూ.

బుజ్జితల్లి వచ్చిన తర్వాత చిన్నతల్లికి పని మరీ ఎక్కువయిపోయింది. రోజూ దాని వళ్ళంతా శుభ్రం చేయడం, అన్నంపెట్టడం, వారానికోసారి స్నానం చేయించడం, పశువుల ఆసుపత్రికి ఇంజెక్షన్ చేయించడానికి తీసుకెళ్ళడం. అయినా ఆ చిన్నతల్లికి ఆ పనంతా ఆనందం కలిగించేది.

సంవత్సరం తర్వాత చంద్రశేఖరంగారికి శ్రీకాకుళం నించీ విశాఖ పట్నం బదిలీ అయింది. అప్పటికే బుజ్జితల్లి బాగా పెద్దదయింది. ఇంటికి ఎవరినీ రానిచ్చేది కాదు. గట్టిగా మొరుగుతూ హడావుడి చేసేది. చిన్నతల్లిని వైజాగ్‌కు వారితో పంపడం ఇష్టంలేక వాళ్ళమ్మ ఆమెను తనతోపాటు వాళ్ళ ఊరు తీసుకెళ్ళిపోయింది. బాబును, బుజ్జితల్లిని వదల్లేక వదల్లేక వాళ్ళ ఊరు వెళ్ళింది చిన్నతల్లి.

*　　*　　*

చిన్నతల్లికి ఇప్పుడు పదిహేడేళ్ళు. మామయ్య కొడుకుతో పెళ్ళి చేసేసింది వాళ్ళ అమ్మ. చిన్నతల్లి మొగుడు లారీ క్లీనరు. శ్రీకాకుళం, విశాఖపట్నం వెళ్ళే లారీల్లో తిరుగుతాడు.

ఒక రోజు చిన్నతల్లి తన భర్తను అడిగింది. ''వైజాగ్‌లో మా జయమ్మ గారు వాళ్ళ చిన్నబాబు, నా బుజ్జితల్లి ఉన్నారు. ఒకసారి వెళ్ళి చూస్తాను. వాళ్ళెక్కడున్నారో కనుక్కో బావా!'' అంది.

చిన్నతల్లి భర్త వైజాగు వెళ్ళినప్పుడల్లా ఎవరైనా ఉద్యోగస్తులు కనిపిస్తే చంద్రశేఖర్‌గారి గురించి అడిగేవాడు. ''శ్రీకాకుళం నుంచి వచ్చారు, ఇంజనీరు గారు ఆయన అడ్రసు కావాలి'' అనేవాడు. అలా ఒక సంవత్సరంపాటు ప్రయత్నించగా మొత్తానికి చంద్రశేఖరంగారు పనిచేసే ఆఫీసు అడ్రసు, ఆయన వుండే సీతమ్మధారలోని ఇంటి అడ్రసు పట్టుకున్నాడు. చిన్నతల్లికి చాలా సంతోషం వేసింది. ''నన్ను వాళ్ళింటికి ఒకసారి తీసుకెళ్ళు బావా!'' అంది చిన్నతల్లి అలాగే అన్నాడు ఆమె మొగుడు.

ఒక రోజు లారీ ఒరిస్సా వెళుతూంటే చిన్నతల్లిని తనతోపాటు లారీలో వైజాగ్ వరకూ తీసుకొచ్చి చంద్రశేఖరంగారి అడ్రసున్న కాగితం ఇచ్చి ఆమె భర్త ఒరిస్సా వెళ్ళిపోయాడు.

చిన్నతల్లికి చాలా ఉత్సాహంగా ఉంది. భర్త చెప్పిన నెంబరు బస్సెక్కి సీతమ్మధారలో దిగింది. ఆనందంతో ఆమె అడుగులు తడబడ్డాయి. 'అమ్మ గారు, అయ్యగారు తనను చూసి సంతోషిస్తారు. చినబాబు పెద్దయిపోయి వుంటాడు. అయినా తనను గుర్తుపడతాడు. బుజ్జితల్లితో కాసేపు ఆడుకోవాలి' అనుకుంటూ చిన్న తల్లి అడ్రసు కాగితంతో ఇల్లు వెతకడం మొదలెట్టింది. గంటసేపయినా ఆమెకు ఇల్లు దొరకలేదు. ఇంక విసుగెత్తి వెళ్ళిపోదామను కునేసరికి ఎవరో చెప్పారు. కొంచెం ముందుకు వెళితే నీళ్ళ టాంకు పక్కన రెండస్థుల బిల్డింగ్ అని చిన్నతల్లి పరుగులాంటి నడకతో అక్కడకు చేరుకుంది.

ఇంటి గుమ్మం ముందు నుంచుని "అమ్మగారూ!" అని పిలచింది. లోపల అంతా హడావిడిగా వుంధి. చుట్టాలంతా వచ్చారు కాబోలు ఏదో పార్టీ జరుగుతోంది అనుకుంది చిన్నతల్లి. అంతలో ఇంకొంతమంది బంధువు లొచ్చారు. లోపల్నించి 'బోయ్' మంటూ మొరుగుతున్న శబ్ధం వినిపించేసరికి లోపలకు వెళుతున్న చుట్టాలంతా ఒక్కసారి వెనక్కి వచ్చారు. చిన్నతల్లి గుమ్మం లోపలకు తలపెట్టి చూసింది. బాగా బలంగా ఎత్తుగా పెరిగిన బుజ్జితల్లిని చూసేసరికి చిన్నతల్లికి ఆనందం వేసింది.

బయటనుంచున్న వాళ్ళను మొరుగుతూ చూసిన బుజ్జితల్లి, చిన్నతల్లిని చూడగానే తోక ఆడించుకుంటూ వచ్చి వళ్ళంతా నాకింది. కొంగు పట్టుకుని లాగుతూ ముందుకు తీసుకెళ్ళింది చిన్నతల్లిని "వద్దు బాగోదు లోపల అంతా ఉన్నారు" అంటూ చిన్నతల్లి బైటే నుంచుంది. ఇంతలో అమ్మగారు బైటకొచ్చి చూసి ఎవరూ? అంది. "నేనమ్మా మర్చిపోయారా" అంది చిన్నతల్లి నవ్వుతూ. ఇంతలో చంద్రశేఖరం బైటకొచ్చి చిన్నతల్లి వంక పరిశీలనగా చూసి "ఎందు కొచ్చిందీ అమ్మాయి డబ్బులు కోసమా? తొందరగా ఇచ్చి పంపించు" అన్నాడు.

ఆ మాటలు విన్న చిన్నతల్లికి దిగులేసింది."అమ్మగారూ! అబ్బాయి గారిని చూసిపోదామని వచ్చాను" అంది. అంతలో ఇంటిముందు కారు ఆగింది. ఒక పట్టుచీర ఆవిడ, సూటు వేసుకున్న వ్యక్తి దిగడంతో చిన్నతల్లి మాటలు పట్టించుకోకుండా వాళ్ళు కారులో వచ్చిన వాళ్ళను తీసుకొని ఇంట్లోకి వెళ్ళి పోయారు. ఇంతలో ఎనిమిదేళ్ళ అబ్బాయి బైటకొచ్చాడు. మెడలో బంగారు చైను, వేళ్ళకు ఉంగరాలతో మెరిసి పోతున్నాడు.

కొత్త డ్రెస్సు వేసుకున్న ఆ అబ్బాయి "బాబూ బావున్నావా?" అంటూ చిన్నతల్లి ఆ అబ్బాయిని ఎత్తుకోబోయింది. ఆ అబ్బాయి భయంగా వెనక్కి వెళ్ళాడు. "ఏయ్ ఎవరు నువ్వు.. దొంగముఖంలా వున్నావ్" అంది అక్కడకు వచ్చిన ఒక ముసలావిడ. ఆ మాటలకు చిన్నతల్లి సిగ్గుతో బిక్కవచ్చిపోయింది.

గబగబ ఆ ఇంటి ఆవరణ దాటి బైటకొచ్చేసింది. అప్పటికే చీకటిపడింది. పల్చగా అలుముకుంటున్న చీకటి తెరలు, ఆకాశంలో మిణుకు మిణుకు మంటున్న నక్షత్రాలు. ఆ క్రొత్త ప్రదేశంలో ఒంటరిగా నడుస్తున్న చిన్నతల్లికి భయం వేసింది.

ఇంతలో బోయ్‌మంటూ మొరుగుతూ బుజ్జితల్లి ఆమె వెంటే వచ్చింది. దానితో కబుర్లు చెబుతూ ముందుకు నడిచింది చిన్న తల్లి. ఆ రోడ్డు దాటేసరికి బస్టాండుకు వెళ్ళటానికి తనెక్కాల్సిన బస్సు బయలుదేరడానికి సిద్ధంగా వుంది. చెయ్యి ఊపుతూ బస్సెక్కింధి చిన్నతల్లి. ఆ బస్సు కదిలినా గట్టిగా మొరుగుతూ బస్సు వెనకే వస్తున్న బుజ్జితల్లిని చూసిన చిన్నతల్లికి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. బస్సు వేగం అందుకున్నా ఇంకా బస్సు వెనకనించే అరుస్తూ పరిగెడుతున్న బుజ్జితల్లిని చూసిన చిన్నతల్లికి మనసు చెమ్మగిల్లింది.

* * *

జరిగిన ఘటనను చెప్పడం పూర్తిచేసి భారంగా నిట్టూర్చాడు చంద్రశేఖరం. ‘‘మైగాడ్...అన్నేళ్ళ తర్వాత వచ్చిన చిన్నతల్లిని గుర్తుపట్టి ప్రేమగా ఆమె వెంట వెళ్ళిందన్నమాట! మరి ఎలా చనిపోయింది?’’ అన్నాడు రామానుజం.

‘‘ఆ రోజు మా అబ్బాయి పుట్టిన రోజు.. అంతా హడావుడిగా వుంది అన్నేళ్ళ తర్వాత వచ్చిన అతిధి చిన్నతల్లి. ఆమెను మేం స్వీకరించలేకపోయాం. మా తిరస్కారానికి బాధపడి ఆమె వెళ్ళిపోయింది. బుజ్జితల్లి మాత్రం మూగజీవి. దానికి సోషల్ స్టేటసులు, అహంభావాలు లేవు. అది ప్రేమగా ఆ అమ్మాయి వెంట పరిగెత్తింది. బుజ్జితల్లి ఎందుకు పరిగెడుతుందో అర్థంకాక నేను అనుసరించాను. అప్పటికే చిన్నతల్లి బస్సులో వుంది. బస్సు వెనక అడ్డంగా పరిగెడుతూ బస్సు వెనకే వెళ్ళింది. బస్సెళ్ళిపోయింది. ఎదురుగా వస్తున్న లారీ క్రింద బుజ్జితల్లి పడింది. అంతే!’’ నిట్టూర్చాడు బాధగా చంద్ర శేఖరం.

రామానుజం వెంటనే, "ఈ సంఘటన నిజంగా నన్ను కదిలించింది. ఒక కథ. ఎవరు రాసారో తెలీదు. అది గుర్తుకొస్తోంది. దేవుడు అన్ని ప్రాణుల్ని సృష్టించి విశ్రాంతికోసం నిద్రకు ఉపక్రమించాడట. ఆ సమయంలో తనకు బదులుగా విశ్వాసంతో, ప్రేమతో త్యాగశీలతతో పనిచేసే ప్రాణి ఎవరూ? అని అడిగాడట తను సృష్టించిన ప్రాణుల్ని మనిషితో సహా ఏ ప్రాణీ ముందుకు రాలేదట. అప్పుడు దేవుడికి తెలిసిందట. తను అలాంటి ప్రాణిని సృష్టించ లేదని. అప్పుడు ఒక జీవిని సృష్టించి తన పేరు GOD లోని అక్షరాలు తిరగేసి DOG అనే పేరు పెట్టాడట...." అన్నాడు.

"ఔను నిజంగా, బుజ్జితల్లిలో ప్రేమ, విశ్వాసం వున్నాయి. తనను చేరదీసి పెంచిన చిన్నతల్లి కోసం అది తెగ ఆరాటపడింది" అన్నాడు చంద్రశేఖరం.

"మీతో చిన్నతల్లి మాట్లాడకుండానే వెళ్ళిపోయింది కదా. మరి మీ ఇంటి అడ్రసుకోసం చిన్నతల్లి మొగుడు సంవత్సరంపాటు వెదికినట్టు ఎలా తెలిసంది?" అన్నాడు రామానుజం.

అందుకు వెంటనే చంద్రశేఖరం, "చిన్నతల్లిలాగానే ఆమె మొగుడు ఒక వెర్రిబాగులవాడు ఒరిస్సా నుంచి రెండోరోజు మా ఇంటికి వచ్చాడు. ఇంకా చిన్నతల్లిని మా ఇంట్లోనే వుంచుకొని ఆతిథ్యం ఇస్తామనుకున్నాడు.. అంతటి విశాల హృదయం వుందా మాకు? అప్పుడు మమ్మల్ని చూడటానికి చిన్నతల్లి ఎంత ఆరాటపడిందో! మా అడ్రసు కోసం సంవత్సరంఫాటు తను ఎలా తిరిగాడో!" చెప్పాడు. చంద్రశేఖరం అన్నాడు బాధగా.

"సరే, నేను వెళ్ళొస్తాను. నా మనసును కుదిపేసే విషయం చెప్పావ్. హార్ట్ టచింగ్‌గా వుంది" అంటూ లేస్తూ "ఇంతకీ మీ ఆవిడ, అబ్బాయి ఏ ఊరు వెళ్ళారు?" అన్నాడు రామానుజం.

“శ్రీకాకుళం దగ్గర ఒక పల్లెటూరుకు వెళ్ళారు. ఒక ఆత్మబంధువును చూద్దామని” అన్నాడు చంద్రశేఖరం.

“ఎవరూ? ఆ ఆత్మబంధువు” అంటూ ఆశ్చర్యంగా అడిగాడు రామానుజం.

“చిన్నతల్లి” అంటూ కళ్ళు తుడుచుకున్నాడు చంద్రశేఖరం.

*(15-3-2008 ఆంధ్రభూమి దినపత్రిక)*